క్లుప్తంగా

ఐఏఎస్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



కవాడిగూడ: అనలాగ్ ఐఏఎస్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్, అస్త్ర పోస్టర్‌ను ఇందిరా పార్కు చౌరస్తా సమీపంలో ఆవిష్కరించారు. అఖిల భారత స్థాయి 2022 సంవత్సరం సివిల్స్ పరీక్షల్లో 40వ ర్యాంకు సాధించిన శ్రీసాయి అశ్రిత్‌శాఖమూరితో కలిసి అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఇన్‌స్టిట్యూట్ ప్రతిఏటా సివిల్స్‌లో ర్యాంకులు సాధిస్తుందన్నారు. ఈ ఏడాది 3,8వ ర్యాంకులను సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: ముదిరాజ్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ (టీఆర్ఎంఎస్) సంఘం అధ్యక్షుడు ఎల్.రమణముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్ ముదిరాజ్‌లు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్‌గా పిట్టల రవీందర్‌ముదిరాజ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కలిసి అభినందించారు. పార్టీలో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నందున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పార్లమెంట్ భవన ప్రారంభం రాజ్యాంగ విరుద్ధం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రపతి లేకుండా నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎ.ఎ.రహీం అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక 9 ఏళ్ల పాలనలో దేశవ్యాప్తంగా నిరుద్యోగం రోజు రోజుకు రెట్టింపు అవుతుందని ఆరోపించారు. డీవైఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇమాగ్నరాజ్ భట్టాచార్య, డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోటరమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఉపాధ్యక్షులు జావేద్, మహేందర్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో ఆశించిన మార్పులు

చిక్కడపల్లి: విద్యతోనే సమాజంలో ఆశించిన మార్పులు వస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ధనలక్ష్మి బ్రైట్‌లైట్స్ యాక్టివిటీస్ అండ్ కల్చరల్ ఈవెంట్స్, మీట్ మీ అబ్రాడ్ ఓవర్సీస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ బస్తీకి చెందిన ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన ఎమ్మెల్యే సన్మానించారు. సంస్థ చైర్మన్ ధనలక్ష్మి, సలహాదారు సిద్దేశ్వరరావు, పాత్రికేయులు రత్నాకర శర్మ, నవీన్‌యాదవ్, రాజు, ప్రభు, శైలజ, రాజ్‌కుమార్, శ్రీకాంత్ గడ్డమీది శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉపాధి కల్పనకు మార్గం జాబ్ కనెక్ట్

చిక్కడపల్లి: డిగ్రీ పట్టాలెన్ని ఉన్నా ఉపాధి కలిపించే మార్గం ఒక్కటే సరైందని నిరూపించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ జాబ్ కనెక్ట్ కార్యక్రమాన్ని చేపట్టిందని సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో నిరుద్యోగ నిర్మూలనకు జాబ్ కనెక్ట్ కార్యక్రమాన్ని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా డీసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంతో మంది నిరుద్యోగులు నేడు ఉద్యోగాల కోసం పట్టణాలకు వలసలు వచ్చి చివరకు కంపెనీల చుట్టూ తిరిగి విసిగిపోయి చెడు మార్గాల వైపు మళ్లుతున్నారన్నారు. ఈ క్రమంలో వారిని చక్కటి మార్గంలో పెట్టాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన జాబ్ కనెక్ట్ నిరుద్యోగ యువతకు చేయూత అని అన్నారు. అదనపు డీసీపీ రమణారెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం ద్వారా జాబ్‌కనెక్ట్ నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, చిక్కడపల్లి, గాంధీనగర్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సంజయ్‌కుమార్, ఎస్.మోహన్‌రావు, జంహగీర్ యాదవ్, చిక్కడపల్లి డీస్సై కెశిశుపాల్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై కె.వెంకటరమణ, ఎస్సైలు సీహెచ్. నాగరాజు, సందీప్‌రెడ్డి, కిరణ్ కుమార్, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, అభిలాష్, అరోరా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం తదితరులున్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం



క్రీడా సామగ్రీని పంపిణీ చేస్తున్న కె. లక్ష్మణ్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్లను అందజేస్తున్న నరేందర్‌గౌడ్ తదితరులు

చిక్కడపల్లి: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్ టీఆర్టీ గ్రౌండ్స్‌లో యువతకు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందించే కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని యువకులను క్రికెట్‌కిట్స్, వాలీబాల్, పలు క్రీడా సామగ్రిని అందజేసిన లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో దేశ యువతకు తమ శరీరదారుఢ్యం, ఆరోగ్యం పొందాలంటే ప్రతిరోజూ యోగా, క్రీడల్లో రాణించాలని కనీసం రెండు గంటలైనా ఆటల్లో పాల్గొనాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియం గ్రౌండ్‌లో కళాభవనం నిర్మిస్తామంటే దాన్ని అడ్డుకుని వందలమంది యువత ప్రతిరోజు ఆటలు ఆడుకునే స్థలాన్ని మార్చే ప్రసక్తేలేదని అప్పట్లో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా తాను అడ్డుపడినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన యువతకు తమ నుంచి అన్ని విధాలా ప్రోత్సాహం ఉంటుదన్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ముత్యాలు, ఎండీ మహమూద్, నర్సింగరావు, ఉమేష్, సత్తిరెడ్డి, నవీన్, లక్ష్మణ్‌యాదవ్, సాయికుమార్, సత్యం, ఆనంద్, రహమత్‌అలీ, రఘుయాదవ్, సాయికృష్ణ, తరుణ్, తులసి, సంధ్యారాణి, సంయుక్తరాణి, పూర్ణ తదితరులున్నారు.

కరాటేలో అక్కాచెల్లెళ్ల వరల్డ్ రికార్డు..

కాచిగూడ: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరాటేలో అక్కాచెల్లెళ్లు ఇద్దరు వరల్డ్ రికార్డ్స్ సాధించారు. శనివారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ దీనికి వేదికైంది. డిగ్రీ చదువుతున్న అమృతరెడ్డి, నారాయణగూడలోని జాహ్నవి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఘన సంతోషిణిరెడ్డిలు అక్కాచెల్లెళ్లు. కాగా వీరిద్దరూ కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ఇరువురు వేర్వేరుగా కరాటేలో ఇప్పటికే పలు వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్నారు.

- తొలిసారిగా ఇద్దరు కలిసి వరల్డ్ రికార్డ్స్‌లో పాల్గొని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు.
- రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కరాటేలో శిక్షణ పొందిన అక్కాచెల్లెళ్లు 9 నిమిషాల్లో 9 విభాగాల్లో 81 సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ప్రదర్శించి వరల్డ్ రికార్డ్ సాధించాల్సి ఉంది.
- అనుకున్న సమయానికంటే ముందే 6 నిమిషాల 14 సెకండ్లలోనే రికార్డును పూర్తిచేసి వరల్డ్ రికార్డును సాధించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో–ఆర్డినేటర్ నరేందర్‌గౌడ్ పాల్గొని రికార్డ్స్ నమోదు చేసి అక్కా చెల్లెళ్ల ఇద్దరికి సర్టిఫికెట్లు, మెమోంటోను బహూకరించారు. జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, మహాలక్ష్మిరామన్‌గౌడ్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అశోక్ ఆనంద్‌కుమార్, గోషామహాల్ పోలీస్ ట్రెనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ బురహాన్‌అలీ, డాక్టర్ కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్‌రెడ్డి, నాయిని విజితారెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- నర్సింహబస్తీలో రూ. 17.8 లక్షలతో నూతన పైప్‌లైన్లు
- సీసీరోడ్ల నిర్మాణానికి రూ.75 లక్షల కేటాయింపు



తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీఠ వేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. దీనిలో భాగంగానే నియోజక వర్గ ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ ద్వారా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించామన్నారు. నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో రూ. 17.80 లక్షలతో శనివారం నూతనంగా చేపట్టనున్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాట్లాడారు.

- రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ.. అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ సూచనలు, ఆదేశాలు, మంత్రి కేటీఆర్ సహకారంతో జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏల నుంచి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామన్నారు.
- పార్కుల సుందరీకరణ, డ్రైనేజీ- సీవరేజీ పైపుల ఏర్పాటు, సీసీరోడ్ల నిర్మాణం, హుస్సేన్ సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు రత్నానగర్ బ్రిడ్జిపై వర్టికల్ గార్డెన్ నిర్మాణ పనులను చేపట్టామని వివరించారు.
- డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తయ్యాయని మరికొన్ని పనులు చివరిదశలో ఉన్నాయన్నారు.
- నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి మరో రూ. 2కోట్లు మంజూరయ్యాయన్నారు. రూ. 75 లక్షలు నల్లకుంటలోని స్ట్రీట్ నంబరు 4,5,6లలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.
- బస్తీలో పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే ప్రత్యేకంగా వృద్ధులను కలిసి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. కంటి వెలుగు, బస్తీ దవాఖానలో అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కాచిగూడ: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. కాచిగూడ డివిజన్, కిషోర్ థియేటర్‌లేన్‌లో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న 500 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడి నిత్యం విద్యుత్ సమస్యలు వస్తుండటంతో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు 500 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి సమయాల్లో పోకిరీల బెడద తీవ్రంగా ఉందని ఈ దారి మీదుగా మహిళలు, వాహనదారులు వెళ్లాలంటేనే భయాందోళనకు గురౌతున్నారని స్థానికులు తెలిపారు. సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే నారాయణగూడ పోలీసు అధికారులకు సమస్యను వివరించి రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేపట్టాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష, డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్, నాగేందర్ బాబ్జీ, కృష్ణాగౌడ్, శ్రీకాంత్, బబ్లూ సింగ్, ఆంటోని, విద్యుత్, జీహెచ్ఎంసీ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ సేవలు మరువలేనివి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చినజీయర్ స్వామి

కవాడిగూడ: రామకృష్ణ మిషన్ స్థాపించి 125 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఏడాది పాటు నిర్వహించిన కార్యక్రమాలు రామకృష్ణ మఠంలో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం వివేకానంద ఆడిటోరియంలో 'భిన్నత్వాల్లో ఏకత్వం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అధ్యక్షత వహించిన ఈ సదస్సులో చినజీయర్ స్వామి పాల్గొని మాట్లాడారు. 11వ శతాబ్దంలో రామానుజాచార్యులు ప్రతిపాదించిన వేదాంతదర్శనం గురించి వివరించారు. ఆనాడే హరిజనులకు దేవాలయ ప్రవేశం చేయించి అందరినీ సమానంగా చూశారన్నారు. భారత సనాతన సంప్రదాయాలను సంస్కృతి అందరికీ తెలిసేలా చేశారన్నారు. అమెరికా హర్ష విద్యాగురుకులం ఉపాధ్యక్షుడు స్వామితత్వ విదానంద సరస్వతీ, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య వీరనారాయణ, పాండురంగ, రామకృష్ణ మిషన్ వివేకానంద ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి స్వామి ప్రియానంద, తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ తదితరులున్నారు.

నేడు సంగీత శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు



భక్తిగీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

నల్లకుంట: సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభించిన వేసవి భక్తి సంగీత శిక్షణాతరగతులు శనివారంతో ముగిశాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. ఈరోజు బాగ్ అంబర్‌పేట్‌లోని షిరిడీ సాయి బాబా ఆలయం ధ్యాన మందిరంలో సాయంత్రం 5 గంటలకు ముగింపు వేడుకలు ఉంటాయని వివరించారు. శనివారం షిరిడీ సాయిబాబా ఆలయం రెండో అంతస్తులో ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి, ఈవెంట్ మేనేజర్లు నందిని, యామినీల పర్యవేక్షణలో భక్తి సంగీతం పునఃచ్ఛరణ తరగతులను నిర్వహించారు. చిన్నారులు కీ బోర్డుపై ఆకట్టుకోగా.. పెద్దలు భక్తి గీతాలను ఆలపించారు.

క్యూనెట్ బాధితులకు న్యాయం చేయాలి



ధర్నాచౌక్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: ఉద్యోగాలు వస్తాయని ఆశతో విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (క్యూనెట్) సంస్థల్లో డబ్బులు పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితుల సొమ్మును తిరిగి ఇప్పించి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు, క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. క్యూనెట్ కంపెనీకి కట్టిన డబ్బులు బాధితులకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ.. హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. సుధాకర్ మాట్లాడుతూ.. డైరెక్టర్ సెల్లింగ్, చైన్ మార్కెటింగ్, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో క్యూనెట్ లాంటి సంస్థలు మోసపూరిత కార్యక్రమాలకు పాల్పడుతూ.. ప్రజలను మోసం చేస్తూ కోట్లాది రూపాయలను దండుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం, దేశంలో మార్కెటింగ్ పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఈ సంస్థలను నిషేధించి సంస్థ డైరెక్టర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

- స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఆరుగురు అగ్నిప్రమాదానికి గురైతే వారి పేరుపై ఉన్న రూ.22 లక్షల డిపాజిట్లను వారి కుటుంబ సభ్యులకు ఇవ్వలేదని ధ్వజమెత్తారు.
- క్యూనెట్ సంస్థ యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, నాయకులు అన్సారీ, జావేద్, రాకేష్, మజీద్, భూషణ్, క్యూనెట్ బాధితుల జేఏసీనేతలు ఆనంద్, మమత, శ్రావణ్, వినయ్, కళ్యాణి, కృష్ణవంశీ, మురళీ, రామకృష్ణ తదితరులున్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను సన్మానిస్తున్న ప్రదీప్‌కుమార్

చిక్కడపల్లి: క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రోత్సహిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి పీఅండ్‌టీ కాలనీ, బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీహాల్‌లో రెండురోజుల పాటు జరిగే రెండో జాతీయ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడారంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. అసోసియేషన్ చైర్మన్, రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏఏఓ ప్రదీప్‌కుమార్, అధ్యక్షులు పీవీఆర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి శృతి, అర్జున అవార్డు గ్రహీతలు భారతిసింగ్, కెప్టెన్ పరంజిత్‌శర్మ, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ రాజు శర్మ, శివ ఛత్రపతి అవార్డు గ్రహీత ఉదయ్‌శెట్టి, నాగరాజు, పవన్‌రామ్, రంజాన్ అలీ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలి: ఆర్. కృష్ణయ్య



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ట్రస్టెడ్ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుగూరి రాజారావ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ.. న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకొచ్చేందుకు వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయం ధర్మాన్ని కాపాడే న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టేందుకు న్యాయవాద చట్టం అవసరమన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.20 వేల ఉపకార వేతనం ఇవ్వాలన్నారు. హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్, 60 ఏళ్లు నిండిన వారికి పెన్షన్‌ను ఇవ్వాలని ఆయన కోరారు. 41 పీఆర్‌సీసీ కింద పోలీస్‌స్టేషన్ బెయిల్స్‌ను ఇవ్వడాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, ఉపాధ్యక్షుడు శివకుమార్, జాయింట్ సెక్రటరీ సిద్ధ, సంతోష్‌కుమార్, నీరజ్‌ఠాకూర్, సంపత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, శ్రీనివాస్, షరత్‌ఠాకూర్, ప్రమీల, లక్ష్మణ్, మహేందర్, శ్రీశైలం, నాగార్జున్, ఉమారాణి తదితరులున్నారు.

యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత విజ్ఞానాన్ని పెంపొందించుకుని తమ భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్ అన్నారు. శనివారం సుందరయ్యపార్కు వద్ద రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో పోటీతత్వం పెరుగుతున్న నేపథ్యంలో యువత అనేక అంశాలపై జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. 16 ఏళ్ల నుంచి 35 ఏళ్లున్న వారు జూన్ 17లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రథమ బహుమతి ఓ ఎలక్ట్రికల్ స్కూటర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 60 నిమిషాల్లో 60 ప్రశ్నలు ఉంటాయని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. టీపీసీసీ కార్యదర్శి వై.శ్రీనివాస్, బాగ్‌లింగంపల్లి మాజీ అధ్యక్షుడు రాజు, ఓబీసీ కన్వీనర్ వరద రాజు, సీనియర్ నాయకులు లక్ష్మణ్‌వర్మ, ఆనంద్ ముదిరాజ్, నాగసాయి, వల్లభరెడ్డి, ఎస్సీసెల్ కన్వీనర్ శివ, పర్వతాలు, రాములు, హన్మంత్, తదితరులున్నారు.

పేదలకు సాయం చేయాలి



కవాడిగూడ: సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న నిరుపేదలు, ఫుట్‌పాత్ వ్యాపారులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం సూచించారు. శనివారం వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రేటర్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై 'చిరువ్యాపారాల హాకర్స్ అండ్ వెండర్స్'కు రమేష్‌రాం గొడుగులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు జయప్రకాష్‌రామ్, మహంకాళి దివాకర్, గవర్నర్ భాస్కర్, జయరాములు, జయప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్: సమస్యల పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదన నిధులను వెంటనే విడుదల చేయిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీ నగర్‌లో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాపూజీనగర్‌లో అధ్వానంగా మారిన డ్రైనేజీ పైపులైన్ వల్ల కలుషిత నీటి సరఫరా జరుగుతుందని ఈ సమస్యను పరిష్కరించేందుకు నూతన పైపులైన్ నిర్మాణానికి వెంటనే నిధులను విడుదల చేయిస్తామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠాజైసింహ, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బక్తీయార్, పార్టీ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ట్రేడ్‌సెల్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, యూత్ కమిటీ అధ్యక్షుడు సదాముదిరాజ్, నాయకులు లింగాల శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్, పూసగోరఖ్‌నాథ్ తదితరులున్నారు.

'అవినీతి ప్రజా ప్రతినిధుల కోసమే ధరణి పోర్టల్'

కవాడిగూడ: 'రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కేవలం అవినీతి ప్రజాప్రతినిధుల కోసమే ఉపయోగపడుతుందని సామాన్య రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని' తెలంగాణ రియల్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని రియల్టర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి సంపన్నుల, భూస్వాముల, భూములను కాపాడుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. ఈ పోర్టల్‌తో రాష్ట్రంలో 9 లక్షల మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ సమస్యలు పరిష్కారం కాక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి భూముల సరిహద్దులను నమోదు చేయలేని దుస్థితిలో ఉందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ వారి కుటుంబాల పేరు మీద లక్షల ఎకరాల భూములు ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధుల భూములు మాత్రం ఎలాంటి సమస్యలు లేకుండా ధరణిలో నమోదవుతున్నాయని సామాన్య రైతుల వరకు వచ్చే సరికి అన్ని సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే ప్రభుత్వం దీనిపై రైతులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

'సంచార జాతుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం'

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఓ ప్రకటనలో విమర్శించారు. సంచార జాతుల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కమిషన్ సిఫార్సుల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సంచార జాతుల వారు సమాజానికి దూరంగా జీవిస్తూ.. సాంఘీక దురాచారాలకు గురవుతున్నారన్నారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందకపోవడం వలన దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఇస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బీజేపీ నేత కూన కుమారస్వామితో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, ప్రవీణ్ తదితరులున్నారు.

జనార్దన్ కథలు విలువలు పెంచుతాయి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్వతీశం, దేవదాసు

చిక్కడపల్లి: అంబల్ల జనార్దన్ కథలు సమాజంలో విలువలు పెంచుతాయని సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో జనార్దన్ రచించిన 'ముంబయి నుంచి ... మరిన్ని కథానికలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ.. జనార్దన్ రచనలో తన జీవితంలోని మానవీయకోణాలను సైతం ఈ రచనలో పొందుపరిచారన్నారు. రచనలో వస్తుశిల్పం అద్భుతంగా ఉందని కొనియాడారు. బైసదేవదాసు, రచయిత కూర చిదంబరం, కవి వీఎస్ఆర్ఎస్ సోమయాజులు, రఘుశ్రీ తదితరులున్నారు.

యువతి అదృశ్యం



వహెద ఉన్నిస (ఫైల్)

నల్లకుంట: ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సయ్యద్‌అసద్ తన కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్ అంజయ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. తన పెద్ద కుమార్తె వహెద ఉన్నీస(18) అడిక్‌మెట్ అచ్యుతారెడ్డి మార్గ్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. రోజూలాగే ఈనెల 26న ఉదయం 10 గంటల సమయంలో తండ్రి తన బైక్‌పై కుమార్తెను స్కూల్ వద్ద వదిలి వచ్చాడు. సాయంత్రం పొద్దుపోయే వరకు చూసినా.. స్కూల్‌కు వెళ్లిన కుమార్తె ఇంటికి రాలేదు. దీంతో తండ్రి కుమార్తె పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లి విచారించగా.. ఆమె ఉదయం 10.15 గంటల సమయంలో పాఠశాల నుంచి వెళ్లిపోయిందని పాఠశాల యాజమాన్యం చెప్పారు. దీంతో ఆయన శుక్రవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.